క్లుప్తంగా

బుచ్చెయ్యపేటలో డ్రోన్‌తో నిఘా



బుచ్చెయ్యపేట రోడ్డులో డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో డ్రోన్‌తో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో డ్రోన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, వాహనాల తనిఖీ, బహిరంగంగా మద్యం సేవించడం, తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై నిఘా కోసం మండలంలో డ్రోన్ కెమెరా ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ రాజారావు

నర్సీపట్నం: శ్రీవిద్యా డిగ్రీ, శ్రీశిరిడీ సాయి ఒకేషనల్ కాలేజీల్లో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సమీద స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆల్కహాల్, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్‌ఐ రాజారావు మాట్లాడుతూ యువత ప్రధానంగా ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ గణపతి మాట్లాడుతూ చెడు వ్యసనాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమిద ప్రాజెక్టు డైరెక్టర్ డి.వీరభద్రరావు, ప్రాజెక్ట్ మేనేజర్ వరహాలుబాబు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు ప్రయాణం'తో ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి



ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

నర్సీపట్నం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్వయం ఉపాధి పొందుతున్న ఆటో డ్రైవర్లు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్నారన్నారు. వీరికి వాహనమిత్ర ద్వారా ఏడాదికి రూ.25 వేలు భృతి ఇవ్వాలన్నారు. ఓలా వంటి సర్వీసులు ప్రభుత్వమే నిర్వహించాలని, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో కొనుగోలుకు రూ.5 లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఎం.రాజు, ఎల్.రాము, ఎల్.కృష్ణ, జి.నూకరాజు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



కొత్తకోటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న ఉప సర్పంచ్ పందల దేవా, తదితరులు

రావికమతం: మండలంలో కొత్తకోటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయానికి చిహ్నంగా భారత ప్రభుత్వం పిలుపు మేరకు మంగళవారం మేజర్ పంచాయతీ కొత్తకోట మండల పరిషత్ స్కూల్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పంచాయతీ కార్యాలయం వరకు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పందల దేవా, పంచాయతీ ఈవో జ్యోతిశ్వర్ రెడ్డి, వీఆర్వో లక్ష్మి, సచివాలయ సిబ్బంది, చిన్నారులు, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు విజయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ విగ్రహ ప్రతిష్టతో పాటు సీతారామ కల్యాణం బుధవారం జరగనుందని నిర్వాహకుడు రాఖీ శ్రీను తెలిపారు. మండల నలుమూలలు నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

'అవసరం మేరకే యూరియా వినియోగం'

మాకవరపాలెం: అవసరం మేరకే యూరియాను వినియోగించాలని ఏవో అప్పారావు రైతులకు సూచించారు. మండలంలోని గిడుతూరు, కొండల అగ్రహారం రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి మూడు విడతల్లో 75 కేజీలు మాత్రమే వినియోగించాలన్నారు.

సచివాలయాల్లో పడకేసిన సేవలు.!

- మూలకు చేరిన కంప్యూటర్లు, ప్రింటర్లు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- ప్రజలు, సిబ్బందికి తప్పని పాట్లు



బీరువాపై నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్, ప్రింటర్, తదితర పరికరాలు

నర్సీపట్నం: వార్డు సచివాలయాల్లో మౌలిక వసతుల లేమితో ప్రభుత్వ సేవల్లో జాప్యం జరుగుతోంది. కంప్యూటర్లు మరమ్మతులకు గురవడంతో ప్రజలకు, కార్యాలయం సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఇటు పరికరాలు పనిచేయక.. అటు అధికారుల ఆదేశాలు కాదనలేక విధి నిర్వహణలో ఉద్యోగులు సతమతమవుతున్నారు. నెలల తరబడి కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరినా ఆలకించే నాథుడు లేడు. ఫలితంగా సకాలంలో పనులు జరగక ప్రజలు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొన్ని సచివాలయాల్లో గదులు శుభ్రం చేసేందుకు నిధుల్లేక సిబ్బంది సొంత సొమ్ము భరించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో 17 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఎక్కువ చోట్ల ప్రభుత్వం సమకూర్చిన



మున్సిపల్ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన సిస్టంపై వర్కు చేస్తున్న 7వ సచివాలయం సిబ్బంది, పక్కనే పని చేయని స్కానర్, సిస్టమ్

ఎలక్ట్రానిక్ వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం సక్రమంగా ఉండడం లేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు దరఖాస్తులకు వచ్చే వారి వివరాలు పొందుపరచడానికి ముందుగా లబ్ధిదారుల ఆధార్, ఇతర అర్హత పత్రాలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు ఆధార్, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు ప్రింట్ తీసి ఇవ్వాలి. ప్రింటర్, స్కానర్ పరికరాలు మొరాయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోతుంది. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉద్యోగులు సమీప సచివాలయాలకు పంపించి అక్కడ తీసుకునేలా చేస్తున్నారు. అక్కడ కూడా ఆవే సమస్యలు ఉంటే దరఖాస్తుదారులు ఇంటర్‌నెట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మార్పు లేకపోవడంతో కొన్ని చోట్ల ఉద్యోగులు తమ సొంత ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు వినియోగిస్తూ కొంత మేరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కోసారి అవి కూడా మొరాయిస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాక్షాత్తు మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పెదబొడ్డేపల్లి 12వ వార్డు 7వ సచివాలయంలో రెండు కంప్యూటర్లు మూలకు చేరాయి. తాత్కాలికంగా మున్సిపల్ కార్యాలయం నుంచి కంప్యూటర్ సచివాలయానికి తీసుకొచ్చి సేవలు అందిస్తున్నారు. ప్రింటర్ మూలకు చేరింది. శారదానగర్‌లోని 10, 13 సచివాలయాల్లో ప్రింటర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఇదే పరిస్థితి మిగతా సచివాలయాల్లో కూడా ఉంది. స్టేషనరీ ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో సిబ్బంది సొంత డబ్బులు వెచ్చిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సచివాలయాల సేవలు అస్తవ్యస్తంగా మారాయి.

బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు చర్యలు



సచివాలయాల్లో పని చేయని కంప్యూటర్లు, ప్రింటర్ల వివరాలు ఇవ్వాలని వార్డు అడ్మిషన్లకు ఆదేశాలు ఇచ్చాం. పరికరాల కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటాం. స్టేషనరీ అవసరమని కార్యాలయానికి వచ్చే సిబ్బందికి స్టేషనరీ ఇస్తున్నాం. ఏమైనా పని చేయకపోతే వెంటనే తెలియజేస్తే పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటాం.

– జంపా సురేంద్ర, కమిషనర్, నర్సీపట్నం మున్సిపాలిటీ

వర్షంతో సర్వత్రా హర్షం



దేవరాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

దేవరాపల్లి: దేవరాపల్లిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రధాన రోడ్లన్నీ జల మయం కాగా, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఖరీఫ్ పంటల సాగుకు ఈ వర్షం ఎంతగానో ఉప యోగపడుతుందని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మెరక ప్రాంత రైతులకు ఈ వర్షం ఊపిరి పోసిందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో 21.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చోడవరం: చోడవరం పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరినాట్లుకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చోడవరంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 18మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

గొలుగొండ: మండలంలో కుండపోత వర్షం కురిసింది. మూడు గంటల పాటు కురిసిన వర్షం కారణంగా బొడ్డేరు, దారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, గొర్రిగెడ్డల నుంచి వరద నీరు ప్రవహించింది. గెడ్డల దిగువన ఉన్న పంట పొలాలు నీటితో నిండిపోయాయి.

'నో డ్రింకింగ్ జోన్' హెచ్చరిక బోర్డు ఏర్పాటు

రావికమతం: ప్రభుత్వ కార్యాలయాల వద్ద విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న ఆకతాయిలకు చెక్ పెట్టేలా పోలీస్ శాఖ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రావికమతం పౌర సరఫరాల గోదాం వద్ద మంగళవారం స్థానిక పోలీసులు 'నో డ్రింకింగ్ జోన్'గా గుర్తించి ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రావికమతం, బుచ్చియ్యపేట మండలాల్లోని 120కి పైగా రేషన్ డిపోలకు రేషన్ బియ్యం, సరుకులు సరఫరాకు వీలుగా గర్నికంలోని అగ్నిమాపక కేంద్రానికి ఎగువన ఉన్న ప్రభుత్వ భూమిలో రూ.25 లక్షల వ్యయంతో పౌర సరఫరాల గోదాంను నిర్మించారు. ముగింపు పనులు జరగక ఈ గోదాంను ఇంకా ప్రారంభించలేదు. మండల పరిషత్ ఆవరణలోని రేకుల షెడ్‌ను గోదాంగా వినియోగించుకుంటున్నారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ గోదాంనే మందుబాబులు తమ విలాసాలకు వినియోగించుకుంటున్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు కూడా వాడుకుంటున్నారు. స్థానికులు ఇక్కడ



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

జరుగుతున్న ఈ కార్యకలాపాలపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎస్‌ఐ రఘువర్మ గోదాం ప్రారంభ విషయమై పౌర సరఫరాల గోదాం డీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి తెలియజేశారు. గోదాం వద్ద నో డ్రింకింగ్ జోన్‌గా పేర్కొంటూ మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అతిక్రమిస్తే మందుబాబులపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

దేవరాపల్లిలో జాబ్‌మేళా నేడు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్‌మేళాను పది, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమో, పీజీ చదివిన 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 13 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆసక్తి ఉన్న వారు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన రిఫరెన్స్ నెంబర్, విద్యా అర్హత, ఆధార్ కార్డు తదితర ధ్రువ పత్రాలను తీసుకొని హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలెందుకు?

రావికమతం: సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలు ఎందుకని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వెలుగు సమావేశం హాల్లో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని గొంప ఎంపీటీసీ సభ్యుడు గెంజి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. చేసిన పనులకు బిల్లులు చేయాలంటే కంప్యూటర్ ఆపరేటర్‌కు కమీషన్ ఇచ్చుకోవాల్సి వస్తుందని ఆయన నేలపై కూర్చుని నిరసన తెలిపారు. రావికమతం ఎంపీటీసీ లక్ష్మి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎరువు దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ఎందుకు పెట్టలేదని వ్యవసాయ శాఖ అధికారిని నిలదీశారు. కొత్తకోటలో మండల పరిషత్ ఆధీనంలో ఉన్న షాపులకు బహిరంగ వేలం వేయాలని



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రాజు, తదితరులు

మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ పూడి దేవా ఎంపీడీవోను కోరారు. మండలంలోని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని ఈ సమావేశానికి వచ్చామని, కానీ చాలా మంది అధికారులు హాజరు కాలేదని, ఆలాంటప్పుడు సమావేశాలు పెట్టడం దేనికంటూ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, మత్సా భవానీ ప్రసాద్, ఎంపీడీవో సీతారామస్వామి, తహసీల్దార్ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు భూ రీసర్వే పూర్తి చేయాలి

నాతవరం: మండలంలో భూరీసర్వే ఈ నెలాఖరుకు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. ఆయన మంగళవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 38 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. వాటిలో 19 రెవెన్యూ గ్రామాల్లో భూరీసర్వే చేయల్సి ఉందన్నారు. ఆయా గ్రామాల్లో రీసర్వే యుద్ధప్రతిపాదికన పూర్తి చేసేందుకు జాయింట్ కలెక్టరు ఇతర మండలాల నుంచి అదనంగా సచివాలయ సర్వేయర్లను ఇక్కడికి పంపించారన్నారు. ముందుగా రెవెన్యూ గ్రామాల్లో సరిహద్దులు నిర్ణయించి తర్వాత రీసర్వే చేస్తారన్నారు. రీసర్వే చేసేటప్పుడు గ్రామంలో అన్ని పార్టీలు నాయకులు, రైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. నీటి తీరువా వసూలు చేయడంపై దృష్టి సారించామన్నారు. రైతుల నుంచి భూమి పన్నులు వసూలు చేయాలని వీఆర్వోలకు టార్గెట్‌లు ఇచ్చామన్నారు. జిల్లాలో అధికంగా నాతవరం మండలంలోనే నీటి తీరువా పన్నులు రూ.5 కోట్లు వసూలు చేయాల్సిందన్నారు.

గ్రంథాలయ పితామహుడు రంగనాథన్‌కు ఘన నివాళి



నర్సీపట్నం: నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ అధికారి కె.త్రిమూర్తులరెడ్డి, పాఠకులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు.

స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

మాకవరపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ ఇప్పటి నుంచే కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండల అగ్రహారంలో రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు, కార్యకర్తలతో కలసి దివంగత నేత వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని, సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని పథకాలు అమలు చేసినా లబ్ధిదారులందరికీ చేరలేదన్నారు. మోసపూరిత



కొండలఅగ్రహారంలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలిరెడ్డి రమణ, చిన్న, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గొలుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి ఆదేశించారు. ఆమె మంగళవారం గొలుగొండ మండలంలోని గుండిపాల, చీడిగుమ్మల, ఎర్రవరం, పోలవరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు సృజనాత్మకమైన విద్యను అందించాలన్నారు. ఆటపాటలతో మంచి బోధన చేయాలని సూచించారు. నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మందులు అందించే విధానాన్ని పరిశీలించారు. అనంతరం గొలుగొండలో ఉన్న ప్రాజెక్టును సందర్శించారు. ఈ కార్యక్రమంలో పీవో శ్రీగౌరి, సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ ఎన్.సూర్యలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని శివపురం 1, 2 కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణపై ఆరా తీశారు. పిల్లల సామర్థ్యాన్ని పరీక్షించారు. పోషకాహారా పంపిణీ కూడా ఆరా తీశారు. పీనారపాలెంలో ఉన్న బాలసదనం వసతిగృహాన్ని సందర్శించారు. సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీడీపీవో జి.వి.రమణి, సూపర్‌వైజర్ ఉన్నారు.



ఎర్రవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

దొండపూడిలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

రావికమతం: దొండపూడిలో దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టకు గ్రామ ప్రజలు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 14న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, 21న అమ్మవారి పండగ చేయడానికి నిర్ణయించారు. దీనిలో భాగంగా అమ్మవారి సంతకం పట్టు నుంచి అమ్మవారి విగ్రహ కలశం ఊరేగింపు సోమవారం నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి పూజలు చేశారు. బుధవారం ఉదయం చండీ హోమం, గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయడానికి చేయనున్నారు. గురువారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

వరి పంటకు బీమా తప్పనిసరి

దేవరాపల్లి: వరిని పంటల బీమా పథకంలో చేర్చారని, వరి పంట సాగు చేస్తున్న రైతులంతా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ సూచించారు. ఈ మేరకు మండలంలోని బోయిలకింతాడలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ములకలాపల్లిలో కూడా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో కాంతమ్మ మాట్లాడుతూ వరి పంటకు బీమా ప్రీమియం చెల్లించేందుకు అక్టోబర్ 15 వరకు గడువు ఉందని, ఎకరానికి రూ.84 చెల్లించాలన్నారు. కరువు తుఫాన్, అకాల వర్షాల సమయంలో పంట నష్టపోయిన రైతులకు ఈ బీమా ఆదుకుంటుందన్నారు. వరి నాట్లు వేసే సమయంలో నారు చివర్లు తుంచి వేసుకోవాలని, కాలి బాట తీసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. మోతాదుకు మించి యూరియా వాడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ దొర, కొమర బాబూరావు, కడిమి నాగేశ్వరరావు, వియ్యపు రాజబాబు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

నర్సీపట్నం: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు మంగళవారం డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు శంకర్రావు, జి.ఎస్.నారాయణ మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీని ఏర్పాటు చేయాలన్నారు. వేతన సవరణ పూర్తయి రెండేళ్ల అయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపోను తరలించడం ఆపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే చెల్లించాలన్నారు. రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎన్ క్యాష్మెంట్ చెల్లింపులు తక్షణమే చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు చెల్లించాలన్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

దేవరాపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎ.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కల్యాణితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి పంపిణీ చేశారు. దేవరాపల్లి హైస్కూల్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్యమేఘన, ఎంఈవో-2 సిహెచ్.ఉమ విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు.



తామరంలో మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న స్టేట్ మోనిటరింగ్ అధికారి సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

మాకవరపాలెం: బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీల పరిధిలో 7,760 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశామని వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ తెలిపారు. తామరం, మాకవరపాలెం పాఠశాలల్లో జరిగే డీ వార్మింగ్ కార్యక్రమాన్ని స్టేట్ మోనిటరింగ్ అధికారి సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి పరిశీలించారు.

కె.కోటపాడు : ఎ.కోడూరు, కొరువాడ హైస్కూళ్లలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశిప్రియాంక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, హెచ్‌ఎం శేఖర్ పాల్గొన్నారు.

నాతవరం: నాతవరం హైస్కూల్‌లో విద్యార్థులకు పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి జి.రామ్‌గోపాల్ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

రోలుగుంట: రోలుగుంట పీహెచ్‌సీ పరిధిలో 2,787 మందికి వైద్యురాలు శ్రావణి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కొమరవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీహెచ్‌ఈవో గోవింద, హెల్త్ సూపర్‌వైజర్ సాజహాస్ మాత్రలు అందజేశారు.

బుచ్చెయ్యపేట: సీతయ్యపేట హైస్కూల్‌లో విద్యార్థులకు జెడ్పీటీసీ దొండా రాంబాబు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

గొలుగొండ: మండంలో విద్యార్థులకు నురుపురుగుల మందులు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గొలుగొండ, కృష్ణదేవిపేట వైద్యాధికారులు శ్యామ్, గాయత్రి ఆయా పీహెచ్‌సీల పరిధిలో చిన్నారులకు నులుపురుగుల నివారణ మందులు అందజేశారు.

ఎం.కోడూరులో 70 మందికి నేత్ర పరీక్షలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, ఆర్‌ఎంపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 70 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి, శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ దుర్గాభవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించాలి

కె.కోటపాడు: ప్రకృతి సాగు విధానంలో పంటలను పండించడం మేలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలో ఆర్.వై.అగ్రహారం, కొరువాడ జగన్నాథపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయంలో సాగు విధానంపై అవగాహన కల్పించారు. ఈ విధానంలో పంటలకు రసాయన ఎరువులకు బదులుగా జీవామృతం వినియోగం ద్వారా పంటను రక్షించుకోవచ్చునన్నారు. ఘన, ద్రవ జీవామృతాల వినియోగంతో ఎరువుల మందుల ఖర్చులను ఆదా చేసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకురాలు కల్యాణి, ప్రకృతి వ్యవసాయం మండల కోఆర్డినేటర్ పాత్రునాయుడు పాల్గొన్నారు.



ఆర్.వై.అగ్రహారంలో జీవామృతం తయారీపై రైతులకు వివరిస్తున్న చేస్తున్న ఏవో సోమశేఖర్